ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని చీర్యాలలో శనివారం ట్రినిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. వైద్యులు వివిధ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కీసర మండల కాంగ్రెస్‌ కమిటీ అధ్యక్షుడు కోల కృష్ణా యాదవ్‌, సింగిల్‌ విండో డైరెక్టర్‌ రామిడి శ్రీనివాస్‌రెడ్డి, నేతలు శ్రీనివాస్‌గౌడ్‌, మధుగౌడ్‌, శ్రీనివాస్‌ ముదిరాజ్‌, అమర్నాథ్‌, సుమన్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్‌ ఏ-బ్లాక్‌ అధ్యక్షురాలిగా కోమలత



నియామకపత్రం అందుకుంటున్న కోమలత

మేడ్చల్‌రూరల్‌: మహిళా కాంగ్రెస్‌ మేడ్చల్‌ నియోజకవర్గ ఏ-బ్లాక్‌ అధ్యక్షురాలిగా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి చెందిన తాటికాయల కోమలత నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా మహిళా కాంగ్రెస్‌ అధ్యక్షురాలు లక్ష్మి ఆమెకు నియామక పత్రం అందజేశారు.

జాబ్‌ మేళాలను సద్వినియోగం చేసుకోవాలి

శామీర్‌పేట్‌: యువత జాబ్‌ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఓ సాంబశివరావు అన్నారు. శనివారం శామీర్‌ పేట మండల పరిషత్‌ కార్యాలయంలో జిల్లా గ్రామీణాభివృద్ధి, ఈజీఎం ఆధ్వర్యంలో జాబ్‌ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వం అందించే పథకాలను వినియోగించుకొని, స్థిరపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మమతాబాయి, జిల్లా జాబ్స్‌ మేనేజర్‌ దివాకర్‌, శివప్రసాద్‌, ఏపీఎం సురేష్‌రెడ్డి, జాబ్స్‌ ట్రైనర్‌ సంధ్య తదితరులు పాల్గొన్నారు. ఈ జాబ్‌ మేళాకు 142 మంది యువతీ యువకులు హాజరయ్యారు.

రేపు జాబ్‌ మేళా

మేడ్చల్‌: ఈనెల 10వ తేదీన మండల పరిషత్‌ కార్యాలయంలో జాబ్‌ మేళా నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వసంతలక్ష్మి తెలిపారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ మేళాకు 7 నుంచి 10వ తరగతి వరకు, డిగ్రీ, ఐటీఐ చదువున్న యువత హాజరుకావాలని కోరారు. ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యే జాబ్‌ మేళాకు యువత హాజరై ఉపాధి అవకాశాలు పొందాలని సూచించారు.

ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్‌ ప్రోగ్రాం

మేడ్చల్‌రూరల్‌: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్‌ కళాశాలలో వారం రోజుల పాటు సాగిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్‌ ప్రోగ్రాం శనివారం ముగిసింది. ఏఐసీటీఈ, అటల్‌ వారి సహకారంతో 'డీప్‌ లెర్నింగ్‌ ఫర్‌ సోషల్‌ ఇంపాక్ట్‌'అనే అంశంపై నిర్వహించిన ఎఫ్‌డీపీలో కళాశాల కార్యదర్శి త్రిశూల్‌రెడ్డి, డైరెక్టర్‌ మోహన్‌, కంప్యూటర్‌ సైన్స్‌ హెచ్‌ఓడీ రాము, డీన్‌ మురళీ, కోఆర్డినేటర్‌ దిలీప్‌రెడ్డి లు పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ లోకనాథం, ట్రెజరర్‌ త్రిలోక్‌రెడ్డి, వైస్‌ ప్రిన్సిపాల్‌ పురుషోత్తం ప్రసాద్‌, అధ్యాపకులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



మేడ్చల్‌రూరల్‌: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మేడ్చల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మన్మద్‌ తెలిపిన వివరాల ప్రకారం..ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రంలోని సాలూరిపేటకు చెందిన కన్నా(40) మేడ్చల్‌కు వలసవచ్చి కిష్టాపూర్‌ రోడ్డులో ఉన్న ఓ సిమెంట్‌ ఇటుకల తయారీ కేంద్రంలో కార్మికుడిగా పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటున్నాడు. తోటి కార్మికుడు సైతం అతనితో పాటు నివాసం ఉంటున్నారు. కొద్ది రోజులుగా మద్యానికి బానిసైన కన్నా శుక్రవారం రాత్రి గదిలో నిద్రించాడు. శనివారం ఉదయం తోటి కార్మికుడు గదిలోకి వెళ్లి చూడగా శవమై కనిపించాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలికి చేరుకున్న పోలీసులు క్లూస్‌ టీంతో పలు ఆధారాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి ఒంటిపై గాయాలు ఉన్నట్లు గుర్తించిన పోలీసులు తోటి కార్మికుడిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. మద్యం మత్తులో ఇద్దరి మధ్య గొడవ జరిగి తోటి కార్మికుడు హత్య చేశాడా లేక మృతుడు మద్యం ఎక్కువగా సేవించడం వల్ల మరణించాడా అనే కోణంతో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా కుంభాభిషేక మహోత్సవం



పూజల్లో రాంపల్లి వాసులు



కీసర: రాంపల్లిలోని మహంకాళి ఆలయ కుంభాభిషేక మహోత్సవం వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం ఉదయం మహంకాళి అమ్మవారి కుంభాభిషేకం, పూర్ణాహుతి కార్యక్రమాలను కనుల పండువగా నిర్వహించారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. సాయంత్రం అమ్మవారి ఊరేగింపులో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు. ఆదివారం ఉదయం అమ్మవారి అలంకరణ అనంతరం భక్తులకు దర్శనం, సాయంత్రం బోనాల ఉత్సవాలను నిర్వహించనున్నట్లు మహంకాళి దేవస్థానం చైర్మన్‌ ఎలసాని భూమయ్య తెలిపారు. పూజల్లో నాగారం మున్సిపల్‌ మాజీ చైర్మన్‌ కౌకుట్ల చంద్రారెడ్డి, నేతలు ఏనుగు సుదర్శన్‌రెడ్డి, గండి అంజయ్య గౌడ్‌, వరకాల పెంటయ్య, నర్సింహారెడ్డి, రాంరెడ్డి, లక్ష్మారెడ్డి, క్యాసారం అశోక్‌గౌడ్‌, రామకృష్ణారెడ్డి, మచ్చ శ్రీనివాస్‌, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌ఎస్‌సీఎస్‌ నూతన భవనం ప్రారంభం



భవనాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్‌ రాంరెడ్డి, వజ్రేశ్‌యాదవ్‌, సుధీర్‌రెడ్డి

ఘట్‌కేసర్‌: పట్టణంలోని రైతు సేవా సహకార సంఘం (ఎఫ్‌ఎస్‌సీఎస్‌) కార్యాలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన వాణిజ్య భవనాన్ని చైర్మన్‌ రాంరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేశ్‌యాదవ్‌, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సదర్శన్‌ రెడ్డి, కాంగ్రెస్‌ బీ బ్లాక్‌ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్‌, ఎండీ రాహుల్‌, వైస్‌ చైర్మన్‌ అనంతరెడ్డి, మాజీ చైర్మన్‌ స్వామి, డైరెక్టర్లు స్రవంతిరెడ్డి, లక్ష్మమ్మ, లక్ష్మారెడ్డి, ధర్మారెడ్డి, పోచిరెడ్డి, రమేశ్‌, వెంకటేశ్‌, రామకృష్ణారెడ్డి, బాలరాజ్‌, మహేందర్‌, కాంగ్రెస్‌ మున్సిపల్‌ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి ముత్యాలు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు కృషి



కాప్రా తహసీల్దార్‌ సుచరిత



వంపుగూడలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు

కాప్రా: కాప్రా మండల పరిధిలోని ప్రభుత్వ స్థలాలు కాపాడటమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని తహసీల్దార్‌ సుచరిత అన్నారు. కాప్రా వంపుగూడలోని 104 సర్వే నంబర్‌లోని 30 గుంటల ప్రభుత్వ భూమి చుట్టూ శనివారం రెవెన్యూ అధికారులు పెన్సింగ్‌ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలాలు ఆక్రమించాలని చూస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. 104 సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమి ఉందని, దీన్ని ఎవరైనా ఆక్రమించినా, అక్రమ నిర్మాణం చేపట్టినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. సదరు స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు తాజాగా ఆ స్థలం చుట్టూ పెన్సింగ్‌ వేశారు.

పార్కు అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ ప్రభుదాస్‌

కుషాయిగూడ: హెచ్‌బీకాలనీలోని రాజీవ్‌పార్కును ఆహ్లాదానికి నెలవుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్‌ ప్రభుదాస్‌ అన్నారు. శనివారం ఆయన రాజీవ్‌పార్కు అభివృద్ధి పనులను పరిశీలించారు. పార్కులో పనిచేయని జిమ్‌ పరికరాలను పూర్తిగా తొలగించి ఓపెన్‌ జిమ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. పార్కులో పచ్చదనం ఉండేలా తగిన చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. పార్కుకు వచ్చే సందర్శకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూస్తామన్నారు. లింగారావు, చారి, రామకృష్ణ, బాలనరసింహ తదితరులు పాల్గొన్నారు.

గణితంలో విద్యార్థుల ప్రతిభ

మేడిపల్లి: జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని రామానుజన్‌ ప్రతిభాశాలి పోటీ పరీక్షల్లో భాష్యం పాఠశాల బోడుప్పల్‌ శాఖ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. జాతీయస్థాయిలో నిర్వహించిన పోటీల్లో రెండో బహుమతి గెలుచుకున్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. పాఠశాల వ్యవస్థాపకులు భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని ఆకాంక్షించారు. భాష్యం పాఠశాల సీఈఓ చైతన్య, జోనల్‌ ఇన్‌చార్జి అంకమరావు, స్వర్ణకుమారి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చెట్ల పొదల్లో నెలల చిన్నారి మృతదేహం

మేడిపల్లి: అభం శుభం తెలియని నెలల చిన్నారి చెట్ల పొదల్లో మృతి చెంది కనిపించింది. మానవత్వం మరిచారో.. శిశువుని వదిలించుకోవాలని చెట్ల పొదల్లో విసిరేశారో వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలోని ప్రధాన రహదారిలో ఉన్న డెకత్లాన్‌ షోరూం సమీపంలోని ఖాళీ ప్రదేశంలో ఉన్న చెట్ల పొదల్లో చిన్నారి మృతదేహాన్ని చూసిన స్థానికులు 100 డయల్‌ చేసి సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా.. అప్పటికే కుళ్లిపోయిన స్థితిలో చిన్నారి మృతదేహం ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి కేసును దర్యాప్తు చేస్తున్నారు.

సెల్‌ఫోన్‌ దొంగల అరెస్ట్‌



వివరాలు వెల్లడిస్తున్న సీసీఎస్‌ ఇన్‌స్పెక్టర్‌ జనార్దన్‌రెడ్డి

పోచారం: మొబైల్‌ షాపులో సెల్‌ఫోన్లు చోరీ చేసిన దొంగలు పోలీసులకు చిక్కారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోచారం ఐటీ కారిడార్‌ పోలీస్‌ స్టేషన్‌ సీఐ రాజు, సీసీఎస్‌ ఇన్‌స్పెక్టర్‌ జనార్దన్‌రెడ్డి, వారి బృందం ఉప్పల్‌ భగాయత్‌లో నలుగురు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించారు. పోచారం, మీర్‌పేట్‌ పోలీస్‌ స్టేషన్ల పరిధిలోని మొబైల్‌ షాపుల్లో సెల్‌ఫోన్లు చోరీ చేసినట్లు విచారణలో అంగీకరించారు. ఉప్పల్‌ భగాయత్‌లో నిందితుల వద్ద లభించిన ఫోన్లతో పాటు నారపల్లిలోని నందనవనం దగ్గర రోడ్డు పక్కనే ఉన్న పొదల్లో దాచిన కారం, ఇనుప రాడ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు రాజస్తాన్‌కు చెందిన ప్రభాత్‌ సింగ్‌ (24), నేపాల్‌ సింగ్‌ (25), తరుణ్‌ పాల్‌ సింగ్‌ (22), ప్రవీణ్‌ సింగ్‌ (21)గా గుర్తించారు. వీరిలో తరుణ్‌ సింగ్‌ కాస్మొటిక్‌ షాప్‌లో పనిచేస్తుండగా, మిగిలిన ముగ్గురు ఆటో డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. ఈ నలుగురు, పరారీలో ఉన్న మరో ఇద్దరు రాజస్థానీయులతో కలిసి ఓ బృందంగా ఏర్పడ్డారు. గూడ్స్‌ వ్యాన్‌లో ఇనుప రాడ్లు, గడ్డపారలను తీసుకొచ్చి మొబైల్‌ షాపు షట్టర్స్‌ తెరిచి సెల్‌ ఫోన్లను చోరీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 3న మీర్‌పేట్‌, 4న అన్నోజిగూడలోని షాపుల్లో సెల్‌ ఫోన్లు దొంగిలించారు. ఎవరైనా అడ్డుపడితే దాడి చేయడానికి కారం, ఇనుపరాడ్లను కూడా వెంట తెచ్చుకుంటారు. నిందితులను అరెస్ట్‌ చేసి, 60 సెల్‌ ఫోన్లు, టీవీ, 2 సౌండ్‌ బార్లు, సీసీటీవీ మానిటర్‌, 2 ఇనుప రాడ్లు, కారం ప్యాకెట్‌, 5 నెక్‌ బ్యాండ్లు, 4 చార్జర్లు, 5 డేటా కేబుళ్లు, చార్జింగ్‌ కేబుల్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ. 11.75 లక్షలు ఉంటుంది.

పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి కృషి



కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలో వివిధ వార్డుల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తున్నామని నాగారం మున్సిపల్‌ కమిషనర్‌ భాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం మున్సిపల్‌ పరిధిలోని గోధుమకుంట, కరీంగూడ, భోగారం, రాంపల్లిదాయర, తదితర వార్డుల పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ఏడాదికి సరిపడే సబ్బులు, నూనెలు, దుస్తులు, సరుకులు పంపిణీ చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సురేష్‌రెడ్డి, ఆర్‌.ఐ ధర్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్‌ వాసవీ క్లబ్‌ అధ్యక్షుడిగా సిద్దిరాములు



మేడ్చల్‌ వాసవీ క్లబ్‌ నూతన కార్యవర్గం

మేడ్చల్‌: మేడ్చల్‌ మండల వాసవీ క్లబ్‌ అధ్యక్షుడిగా సిద్దిరాములు నియమితులయ్యాడు. వాసవీ క్లబ్‌ సభ్యులు మేడ్చల్‌లో సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుని ప్రమాణ స్వీకారం నిర్వహించారు. మండల వాసవీ క్లబ్‌ అధ్యక్షుడిగా సిద్దిరాములు, ప్రధాన కార్యదర్శిగా ఉపేందర్‌, కోశాధికారిగా సంతోష్‌ కుమార్‌లను ఎన్నుకున్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమంలో వాసవీ క్లబ్‌ గవర్నర్‌ ప్రదీప్‌ కుమార్‌, ప్రకాశ్‌ తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వర ఆలయ బోర్డు డైరెక్టర్‌గా శంకరయ్య

బోడుప్పల్‌: కీసరగుట్ట రామలింగేశ్వరస్వామి దేవాలయం ట్రస్ట్‌ బోర్డు డైరెక్టర్‌గా బోడుప్పల్‌కు చెందిన రాపోలు శంకరయ్య నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వ ప్రిన్సిపాల్‌ సెక్రటరీ ఆదేశాలు జారీ చేశారు. శనివారం బోడుప్పల్‌లో శంకరయ్యను కాంగ్రెస్‌ పార్టీ నేతలు యాదగిరి, రాము, జంగయ్య, రాపోలు ఉపేందర్‌, దర్శన్‌, రామస్వామి శాలువా కప్పి అభినందించారు.

రైల్వే అండర్‌ పాస్‌ బ్రిడ్జిని ప్రారంభించాలి



బ్రిడ్జి వద్ద పర్యటిస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

మేడ్చల్‌: శివరాత్రి తర్వాత మేడ్చల్‌లో నిర్వహించే రామలింగేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల లోగా మేడ్చల్‌ గిర్మాపూర్‌ రోడ్డులో ఉన్న రైల్వే అండర్‌ పాస్‌ బ్రిడ్జిని ప్రారంభించాలని పట్టణ కాంగ్రెస్‌ నాయకులు డిమాండ్‌ చేశారు. ఈనెల 26న శివరాత్రి పండగ, తర్వాత మేడ్చల్‌ జాతర ఉంటుందని తెలిపారు. జాతరకు రామలింగేశ్వర ఆలయానికి వేల సంఖ్యలో భక్తులు వస్తారని ట్రాక్‌ అవతలి వైపు ఆలయం ఉండటంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు అండర్‌ పాస్‌ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి రాకపోకలు సాగే విధంగా బ్రిడ్జి నుంచి దారి ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహారెడ్డి, మార్కెట్‌ కమిటీ డైరెక్టర్‌ శంకర్‌, మాజీ చైర్మన్‌ సత్యనారాయణ, నాయకులు మహేష్‌, సంతోష్‌, రంజిత్‌ తదితరులు పాల్గొన్నారు.

విపత్తుల నివారణపై అవగాహన



ప్రభుత్వ పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

జవహర్‌నగర్‌: జవహర్‌నగర్‌ జిల్లా పరిషత్‌ పాఠశాలలో బాల్‌రక్షక్‌ భారత్‌ తెలంగాణ రాష్ట్ర మేనేజర్‌ రంగనాథన్‌ అధ్యక్షతన, ప్రతినిధి చిరివేని రాజుయాదవ్‌ ఆధ్వర్యంలో బాలల సంఘాన్ని ఏర్పాటుచేసి డిజాస్టర్‌ రిస్క్‌ రెడక్షన్‌, స్కూల్‌ అపార్టు హంట్‌ అనే అంశాలపై అవగాహన కల్పించారు. ప్రకృతి పరంగా వచ్చే సహజ విపత్తుల గురించి భూకంపాలు, సునామీలు, వరదలు, వేడిగాలులు వంటివి ఏర్పడినపుడు ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండడానికి కావాల్సిన శిక్షణను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ నేతల సంబరాలు



నాగారంలో బీజేపీ నేతల సంబరాలు

కీసర: ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడంతో నాగారం మున్సిపాలిటీలో బీజేపీ నేతలు సంబరాలు నిర్వహించారు. ఈ మేరకు మున్సిపల్‌ మాజీ చైర్మన్‌ కౌకుట్ల చంద్రారెడ్డి ఆధ్వర్యంలో రాంపల్లి చౌరస్తాలో బాణాసంచా కాల్చిసంబరాలు నిర్వహించారు. మున్సిపల్‌ బీజేపీ అధ్యక్షుడు నాగరాజు, నేతలు వేణు, సీనియర్‌ నేతలు పాల్గొన్నారు.

మేడ్చల్‌: ఢిల్లీలో బీజేపీ ఘన విజయం సాధించడంతో బీజేపీ నాయకులు మేడ్చల్‌లో సంబరాలు చేసుకున్నారు. పట్టణ అధ్యక్షురాలు శైలజ, మండల అధ్యక్షుడు శ్రీశైలంయాదవ్‌ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, వంశీవిజయ్‌ వంజరి, శ్రీకాంత్‌, ప్రేందాస్‌, రాఘవరెడ్డి, వంశీరెడ్డి, లక్ష్మణ్‌, రాజు పాల్గొన్నారు.

మేడ్చల్‌రూరల్‌: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో బీజేపీ నాయకులు బాణాసంచా పేల్చి, మిఠాయిలు పంచకుని సంబరాలు జరుపుకున్నారు. బీజేపీ జిల్లా పార్టీ మాజీ అధ్యక్షులు విక్రంరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్‌ మోహన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు మల్లికార్జున్‌ ముదిరాజ్‌, సరస్వతి, మున్సిపల్‌ అధ్యక్షుడు శ్రీధర్‌ పాల్గొన్నారు.

ఘట్‌కేసర్‌: ఘట్‌కేసర్‌ మున్సిపాలిటీ శాఖ ఆధ్వర్యంలో శనివారం విజయోత్సవం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బస్‌ టెర్మినల్‌ నుంచి అంబేడ్కర్‌ చౌరస్తా వరకు ర్యాలీ చేపట్టి మిఠాయిలు పంచిపెట్టారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సుదర్శన్‌రెడ్డి, మున్సిపల్‌ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు హనుమాన్‌, నాయకులు

శామీర్‌పేట్‌: శామీర్‌పేట మండలం అధ్యక్షుడు కొరివి కృష్ణముదిరాజ్‌ ఆధ్వర్యంలో శనివారం సంబరాలు నిర్వహించారు. శామీర్‌పేట మండలం, అలియాబాద్‌ చౌరస్తా వద్ద పార్టీ కార్యకర్తలు, సీనియర్‌ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని బాణాసంచా కాల్చి స్వీట్లు పంచుకున్నారు. మండల మాజీ అధ్యక్షుడు కైరా యాదగిరి, మాజీ బీజేవైఎం అధ్యక్షుడు శరత్‌ కుమార్‌, నాయకులు బ్రహ్మానందరెడ్డి మంచినీళ్ల లక్ష్మణ్‌, రమేష్‌, అశోక్‌, మల్లేష్‌, నరేష్‌ పాల్గొన్నారు.



మేడ్చల్‌లో..



గండ్లపోచంపల్లిలో..

శ్మశానవాటికలో అన్ని వసతులు కల్పిస్తాం



శ్మశానవాటిక కమాన్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్‌ రజిత

ఉప్పల్‌: మున్నూరు కాపు, రెడ్డి కులస్తుల శ్మశానవాటిలో అన్ని వసతులు కల్పిస్తామని కార్పొరేటర్‌ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి అన్నారు. ఉప్పల్‌కు చెందిన నాయబు వేంకటేశ్వర్లు ఆయన తండ్రి హనుమంతు జ్ఞాపకార్థం నిర్మించిన శ్మశానవాటిక కమాన్‌ను స్థానికులు, సంఘం పెద్దలతో కలిసి ప్రారంభించారు. శ్మశాన వాటిక అభివృద్ధికి తొలి విడతగా రూ. కోటి ఐదు లక్షలు, రెండో విడతగా రూ. 45 లక్షల నిధులను మంజూరు చేయించినందుకు కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మేకల మధుసూదన్‌రెడ్డి, దుబ్బ నర్సింహ్మారెడ్డి, శామీర్‌పేట ధర్మారెడ్డి, మేకల హనుమంతురెడ్డి, నాయబు లక్ష్మమ్మ, నాగిరెడ్డి, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్కులతో ఆహ్లాదం.. ఆరోగ్యం

- ఉద్యోగులు, వృద్ధులు, చిన్నారులకు ఉపయోగకరంగా..
- కనువిందు చేస్తున్న హరితవనం

హబ్సిగూడ: సామాన్యులు నివసించే ప్రాంతాల్లో ఏకాంతంగా గడపలేరు. ఇంటి యజమాని రోజూ ఉద్యోగం, వ్యాపారం లేదా ఇతర పనుల నిమిత్తం బయట నుంచి తిరిగొస్తారు. పిల్లలు రోజూ స్కూల్‌కు వెళ్లినా... సెలవు రోజుల్లో ఆడవిడుపుగా తిరగాలనిపిస్తుంది. ఇవన్నీ గమనించిన నగర పాలకులు ప్రజల అవసరాల కోసం ప్రతి డివిజన్‌లో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ పార్కులను ఏర్పాటు చేశారు. హబ్సిగూడలోని కాకతీయనగర్‌లో కాకతీయ కో- ఆపరేటివ్‌ సొసైటీ సహకారంతో హరితవనం పేరుతో పార్కును నిర్మించారు. సుమారు 4 ఎకరాల భూమిలో 1984లో ఈ పార్కును నిర్మించారు. వేయికి పైగా మొక్కలను నాటి సంరక్షిస్తూ.. హరితవనం పార్కు అని నామకరణం చేశారు.

ఉదయం 5 గంటల నుంచి ప్రారంభం..

హబ్సిగూడ మెట్రోస్టేషన్‌కు అతి సమీపంతో అన్ని వర్గాలకు అందుబాటులో ఉండే కాకతీయ పార్కును ఉదయం 5 గంటల నుంచి 10 గంటల వరకు సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు సందర్శకుల సౌకర్యార్థం తెరిచి ఉంచుతారు.



హబ్సిగూడ కాకతీయనగర్‌లోని హరిత వనం పార్కు



హరితవనం పార్కు ప్రవేశ ద్వారం

ప్రజలకు సౌకర్యవంతంగా ఉంది



హబ్సిగూడ కాకతీయనగర్‌లోని హరితవనం అన్ని వర్గాల ప్రజకు ఎంతో సౌకర్యంగా ఉంది. పార్కులో పెంచుతున్న వివిధ రకాల మొక్కలు, చెట్లు పచ్చదంతో పాటు ప్రశాంత వాతావరణం ఉంటుంది. ప్రకృతిలో సహజ సిద్ధంగా లభించే పచ్చదనాన్ని ఆస్వాదించినప్పుడు శారీరక ఆరోగ్యం, మానసిక ఆనందంతో నూతన ఆలోచనలు రేకెత్తుతాయి.

– ఎస్‌. గౌతమ్‌ప్రసాద్‌, రాజకీయ విశ్లేషకుడు, హబ్సిగూడ

40 ఏళ్లుగా నిర్వహిస్తున్నాం

హరితవనం పార్కును 40 ఏళ్ల నుంచి నిర్వహిస్తున్నాం. ఉప్పల్‌ నియోజకవర్గంలో ఇదే అతిపెద్ద పబ్లిక్‌ పార్కు. టాయిలెట్లు, తాగునీటి సౌకర్యాలతో పాటు పిల్లల ఆటవస్తువులు, వ్యాయామ పరికరాలు, వాకింగ్‌, సైక్లింగ్‌ ట్రాక్‌ ఏర్పాటుతో ఈ పార్కుకు ఉదయం, సాయంత్రం సుమారు వేయిమంది దాకా హాజరవుతారు. సలహాలు, సూచనలకు 9949656122.

– నగేష్‌, పార్కు మేనేజర్‌